క్లుప్తంగా

చలివేంద్రాల ఏర్పాటు సామాజిక బాధ్యత

మధురానగర్(విజయవాడసెంట్రల్): చలివేంద్రాల ఏర్పాటు సామాజిక బాధ్యతని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి సూచించారు. దుర్గాపురంలో శుక్రవారం దుర్గాపురం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన దాత ఏవీ రమణ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

రేపు భారతీయ నృత్యపదర్శురి

విజయవాడ కల్చరల్: కళావిపంచి, శారదా కళాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ సాయంత్రం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో భారతీయ నృత్యపదర్శురి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు డోకిపర్తి శంకరావు, బొప్పన నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండిట్ అంజిబాబు సమర్పణలో కథక్ నృత్యాన్ని అచ్యుత మానస, పేరిణి నృత్యాన్ని మాస్టర్ సాయి వేదాంత్, కూచిపూడి నృత్యాన్ని మృణాళిని, ఆంధ్రనాట్యం అంశాన్ని నిఖిత ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

నర్సులు.. మాతృమూర్తులు

ఏపీ ఎన్జీఓస్ సంఘం జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైద్యరంగంలో నిస్వార్థమైన సేవలు అందిస్తున్న నర్సులే నిజమైన మాతృమూర్తులని ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ అన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ హాల్లో నర్సులను సన్మానించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో నర్సులు ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. అటువంటి నిస్వార్థసేవలు అందిస్తున్న నర్సులను సత్కరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని నర్సులు తమ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. అనంతరం దంత వైద్యశాలకు చెందిన కె. శివలీల, వి.రాణి, పాత ప్రభుత్వాస్పత్రికి చెందిన కె. ఇందిరాదేవి, బి.విజయశ్రీ, సీహెచ్ కల్యాణి, టి.తబిత, ఝాన్సీరాణి, నూతన జనరల్ ఆస్పత్రికి చెందిన ఎస్.కె. షమా వల్లాబేగం, డి. కనకదుర్గను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి సతీష్ కుమార్, సహాధ్యక్షులు బి.వి. రమణ, ఉపాధ్యక్షులు ఎం.రాజబాబు, నగరశాఖ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నర్సులను సత్కరిస్తున్న ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మానికి ప్రతిరూపం శ్రీరామచంద్రుడు

విజయవాడ కల్చరల్: మూర్తీభవించిన ధర్మానికి ప్రతిరూపం శ్రీరామచంద్రుడని ఆధ్యాత్మికవేత్త మల్లాది వెంకటరామనాథ శర్మ అన్నారు. అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవంలో భాగంగా సత్యనారాయణపురం మారుతీ వ్యాయామశాలలో శుక్రవారం వెంకటరామనాథ శర్మ సుందర వైభవం, శ్రీమద్రామయణాంతర్గత హనుమత్ వైభవంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రాముడు వ్యక్తికాదని ఆధ్యాత్మిక శక్తిగా అభివర్ణించారు. హనుమంతుడులేనిదే రామకథలేదన్నారు. సీతాన్వేషణ సమయంలో హనుమంతుడు లంకకుచేరి సీతాదేవిని చూసి చలించిపోయాడన్నారు. రాముడు ఇచ్చిన ఉంగరం చూపించడంతో రామ దూత హనుమంతుడు వచ్చాడని భావించి నట్లు తెలిపారు. సర్వకార్యాలను విజయవంతం చేయడం హన్మత్ లక్షణమన్నారు. సుందరకాండ పారాయణం సర్వశ్రేయోదాయకమని తెలిపారు. దేవాలయ పాలకమండలి సభ్యులు హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మల్లాది

వాగ్గేయకార చరితం.. సదా స్మరణీయం

విజయవాడ కల్చరల్: వాగ్గేయకార సంగీత చరితం సదా స్మరణీయని గాయకుడు బాలాజీకుమార్ అన్నారు. మెలోడీ గాయనీ గాయకుల ఐక్యవేదిక ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం కలిసి పాడుదాం పేరుతో వాగ్గేయకార భక్తి సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. బాలాజీకుమార్ మాట్లాడుతూ మనకు తరగని గని ఆధ్యాత్మిక సంగీతమని దాన్ని భావి తరాలకు అందించాల్సిన అవసరముందన్నారు. సంగీత విద్వాంసులు కామేశ్వరి మాట్లాడుతూ రామదాసు, అన్నమయ్య లాంటి వాగ్గేయ కారుల సంకీర్తనలు సమాజంలో చైతన్యం కలిగించాయన్నారు. ఆమె ఆధ్వర్యంలో చిన్నారి శ్రుతి, సీతాదేవి, కామేశ్వరి, డి.పద్మజ, మీనాకుమారి, దిట్టకవి, పవన్‌కుమార్ రామదాసు, అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగరాజ స్వామి దీక్షితార్ రచించిన కీర్తనలు ఆలాపించారు. వీటితోపాటు సెమీ క్లాసికల్ గీతాలను, చిన్నారి శ్రుతి ఆలపించిన రామదాసు, విఘ్నేశ్వర కీర్తనలు ఆకట్టుకున్నాయి.



ఆలపిస్తున్న శ్రుతి, పవన్‌కుమార్, మీనాకుమారి, బాలాజీకుమార్, సూర్యకామేశ్వరి

దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): నటరత్న ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యాన పలు రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి ఎన్టీఆర్ సేవారత్న, కళారత్న పురస్కారాలను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ స్థాపక అధ్యక్షులు డాక్టర్ కేఎస్ఎస్ నారాయణ మాస్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 20లోపు దరఖాస్తులు పంపాలని ఇతర వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గుర్రపుడెక్క తొలగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దోమల నివారణ చర్యల్లో భాగంగా వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఆదేశాల మేరకు బుడమేరులో గుర్రపుడెక్క తొలగింపు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జేసీబీ, రెండు బోట్ల సాయంతో గుర్రపుడెక్కను తొలగిస్తున్నారు. బయాలజిస్టు సూర్యకుమార్, మలేరియా సూపర్‌వైజర్ బెనర్జి పర్యవేక్షించారు.

నేటి నుంచి సాయిబాబా మందిర వార్షికోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం నుంచి సోమవారం వరకు పుష్కరదశ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి లక్ష్మీతులసి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

200 మందికి అన్నదానం

మధురానగర్(విజయవాడ సెంట్రల్): అన్నార్తుల కడుపు నింపడమే లక్ష్యంగా అన్న సంతర్పణ సేవా సమితి సేవలు అందిస్తుందని సేవాసమితి అధ్యక్షులు గుండు దిలీప్ అన్నారు. జీఎస్ రాజు రోడ్డులో శుక్రవారం అన్నసంతర్పణ సేవాసమితి ఆధ్వర్యాన అన్నదానం జరిగింది. సుమారు 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు జూలూరు శోభన చలపతి గుప్తా, రామమూర్తి కన్నన్, ఇందు లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

